‘వేదిక’ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**


## రాజకీయ భక్తి

***ఓడ మల్లయ్య*** సామెత బీజేపీకి వర్తించినంతగా మరే ఇతర పార్టీకి వర్తించదేమో. మతోద్ధరణ తమ గుత్తహక్కు అని చెప్పుకొంటారు ఆ పార్టీ నేతలు. కానీ మతపరమైన విషయాల్లో ఇచ్చిన హామీని కూడా హుళక్కి చేయడం వారికే చెల్లింది. గత ఎన్నికలకు సుమారు ఏడాది ముందు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు అయోధ్య ఆలయాలు, మఠాలకు అన్నిరకాల పన్నులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. అన్న ప్రకారమే అన్ని పన్నులను రద్దు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీచేసింది. అంతంతమాత్రం ఆదాయంతో నెట్టుకొస్తున్న మహంతులు, పూజారులు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ వారి సంతోషం ఎంతో కాలం నిలవలేదు.

ఎన్నికల్లో గెలిచిన దరిమిలా దొడ్డిదారిన సింబాలిక్ ట్యాక్స్ పేరిట పన్నులు వడ్డిస్తున్నది. దాంతో హర్షం వ్యక్తంచేసిన మహంతులే మండిపడుతున్నారు. ఇదంతా జరుగుతున్నది బీజేపీ గొప్పగా చెప్పుకొనే భవ్య రామమందిరం నిర్మాణమవుతున్న అయోధ్యలోనే కావడం గమనార్హం. అయితే అన్నిరకాల పన్నులు రద్దుచేయడం వల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని అయోధ్య మునిసిపల్ కార్పొరేషన్ ప్రభుత్వానికి ఓ వినతిపత్రం ఎన్నికలకు ముందే సమర్పించింది. ఆ సంగతిని ఎన్నికలు పూర్తయ్యేవరకు బీజేపీ సర్కారు దాచిపెట్టింది. ఎన్నికల్లో విజయం దక్కగానే మళ్లీ పన్నుపోటుకు తెగబడింది. ఏప్రిల్ 1 నుంచి స్లాబులవారీగా పన్ను వసూలు చేస్తున్నారు. దీనిపై మహంతులు మండిపడుతున్నారు. చీటికి మాటికి ఆలయాల ఉద్ధరణ గురించి ఊదరగొట్టే బీజేపీకి నిజంగా ఆ విషయంలో ఉన్న శ్రద్ధ ఎంత? అనేది ప్రశ్నగానే మిగులుతుంది. గతంలో బీహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు ఆలయాల మీద నాలుగు శాతం పన్ను వేసి బీజేపీ అభాసుపాలైంది. ఆలయాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండరాదని సోషల్ మీడియాలో ప్రచారం చేసే బీజేపీ పన్నుల విషయం వచ్చేసరికి ఎలా ప్రవర్తిస్తుందో ఈ ఉదంతాలు తెలియజేస్తున్నాయి.

కేవలం అయోధ్యకు పరిమితమైన సమస్య కాదు. కాశీ, కేదార్‌నాథ్, జోషీమఠ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాల పరిరక్షణ విషయంలోనూ బీజేపీ పనితీరు సానుకూలంగా ఏమీ లేదు. కాశీ విశ్వనాథ ఆలయం పరిసరాల్లో సుందరీకరణ పేరిట జరిపిన కూల్చివేతలపై తీవ్రస్థాయి విమర్శలు వచ్చాయి. ఆధ్యాత్మిక, చారిత్రక వారసత్వ సంపదను ధ్వంసం చేశారని పత్రికలు రాశాయి. చార్‌ధామ్‌లో భాగమైన కేదార్‌నాథ్ ఆలయంలో గోడలకు బంగారు తాపడాల విషయంలో గోల్‌మాల్ జరుగుతున్నట్టు అక్కడి పూజారులే ఆరోపించడం గమనార్హం. దీనిని అధికారులు ఖండించారు. ఇక జోషీమఠ్ ప్రాంతం కృంగిపోవడం వెనుక కారణాలను అన్వేషించిన కమిటీ అభివృద్ధి పేరిట చేపట్టిన పనులే ముప్పుతెచ్చాయని పేర్కొన్నది. ఎడా పెడా కొండలను పేల్చి రోడ్లు వేయడం, ఎన్టీపీసీ భారీ ప్రాజెక్టు కట్టడం వంటివి కుంగుబాటుకు దారితీశాయని తేల్చిచెప్పింది. ఆధ్యాత్మికతను కేవలం టూరిజం కోణంలో చూడటం వల్ల సమస్య వస్తున్నదని అంటున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ నిర్మాణాలు విరివిగా జరుగుతున్నాయి. దీనివల్ల ఆధ్యాత్మిక అంశాలకు ఉండే పవిత్రత గాలికిపోతున్నది. వ్యాపార ధోరణి పెచ్చరిల్లుతున్నది. మతం, దేవుడు, ఆధ్యాత్మికతను రాజకీయం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందే బీజేపీకి దేవుని మీద కన్నా అధికారం మీదే భక్తి ఎక్కువ అని చెప్పవచ్చు.

### బీజేపీ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికే..



ప్రస్ఫుటంగా కనిపిస్తున్న తన వైఫల్యాల నుంచి జనం దృష్టిని మళ్లించేందుకు ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ప్రస్తుత దశలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమూ కాదు.. వాంఛనీయమూ కాదు అని 21వ లా కమిషన్ లోతైన అధ్యయనం తర్వాత తేల్చిచెప్పింది. ప్రస్తుత లా కమిషన్ అదే అంశంపై అభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చింది. దేశ ప్రయోజనాల కన్నా బీజేపీ ఆకాంక్షలు భిన్నంగా ఉన్నాయని గుర్తించాలి.

- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

# విద్యలో నిశ్శబ్ద విప్లవం

‘‘సర్కార్ బడి గింత మంచిగుంటదనుకోలేదు. మేం పిల్లలను సర్కారు బడికే పంపుతున్నం. మా బడి అందంగా, ముద్దుగా ఉన్నది. రోజూ మంచిగ అన్నం పెడుతున్నరు. పుస్తకాలు ఇచ్చింఢ్రు, బట్టలు ఇచ్చింఢ్రు, ఇంగ్లీషు మీడియంలో చెప్పుతున్నరు. నెలకోసారి మమ్మల్ని పిల్చి మా సార్లు, టీచరమ్మలు మా పిల్లల చదువు గురించి చెప్తున్నరు! కాయకష్టం చేసేటోళ్ళం. అప్పోసప్పో చేసి మా పిల్లలనైనా మంచిగ చదివించుకోవాలని వేలకు వేలు అప్పులు చేసేటోళ్లం. ఇప్పుడు మాకు ఆ బాధ లేదు. మన కేసీఆర్ సారు బళ్లను మంచిగ చేస్తున్నరని విన్నం. మా ఊరు బడిని చూస్తే మాకు నిజమని అర్థమైంది. అందుకే ప్రైవేటుకు మాన్పించినం. మా ఊరు బళ్లోనే మా పిల్లలను చేర్పినం. మాకు ఇప్పుడు నాలుగు పైసలు మిగులుతున్నయి!’’



**సువర్ణ వినాయక్**
96186 76215



ఈ మాటలు ఇవాళ ప్రభుత్వ బడికి పంపే పేద తల్లిదండ్రుల గుండె లోతుల్లోంచి వచ్చే మాటలు. ఇది కన్నులారా చూసే భాగ్యం ఈ విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన పాఠశాల ప్రారంభోత్సవం రోజున కలిగింది. భారత ప్రభుత్వం నుంచి కేంద్ర విద్యాశాఖలోని సంయుక్త కార్యదర్శి అమర్‌ప్రీత్ దుగ్గల్, ఉప కార్యదర్శి సుధా మీనన్ జూన్ 12వ తేదీన మన రాష్ట్రంలోని పాఠశాలల గురించి అధ్యయనం చేసేందుకు ఇక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాల అమలుతీరును క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించేందుకు విచ్చేసిన సందర్భంలో మహబూబ్‌నగర్ జిల్లా ‘హన్వాడ’ ప్రాథమిక పాఠశాల సందర్శనలో తల్లిదండ్రులు వారితో మాట్లాడిన మాటలు. వారితోపాటు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ అధికార బృందం ‘హన్వాడ’ గ్రామంలో తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ‘బడి’ ఎలా ఉంది? పిల్లలు ఎలా చదువుతున్నారని చర్చించినప్పుడు చోటుచేసుకున్న చర్చల సారాంశం ఇది.

> వారందరూ తరగతి గది పరిశీలనలో భాగంగా ఉపాధ్యాయులతో ముచ్చటించిన మాటలు, ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు కూడా ఆనందాన్ని కలిగించినయి. జూన్ 12వ తేదీ పాఠశాల ప్రారంభం రోజునే బోధనాభ్యసన సామగ్రితో బోధించడం, పిల్లలకు కార్యకలాపాలు, ఆటపాటలతో చదువు చెప్పడం, ఆ పిల్లలంతా ధారాళంగా చదువడం నిజంగా అద్భుత దృశ్యమే! ‘సుధ’ టీచర్ 3వ తరగతిలో బోధిస్తున్నప్పుడు కనిపించిన దృశ్యం ఇది.

సాధారణంగా ప్రభుత్వ బడి, ప్రభుత్వ ఉపాధ్యాయులు అనగానే చులకనగా భావించేవాళ్లు దీన్ని నమ్మకపోవచ్చు! కానీ, జరుగుతున్న వాస్తవం ఇదే. ‘సుధ’ టీచర్ మాట్లాడుతూ, ‘గత సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమం వల్ల మేం ఫలితాలను చూడగలుగుతున్నాం! చాలా సంతృప్తిగా ఉంది, గర్వంగా కూడా ఉంది. మేం మా పిల్లల కోసం బోధనోపకరణాలను తయారుచేసుకొని బోధిస్తున్నాం. పుస్తకాలతో పాటు వీటిని ఉపయోగించడం వల్ల మా పిల్లలు అద్భుతంగా నేర్చుకుంటున్నారు. ప్రారంభంలో కొంచెం కష్టమనిపించింది. కానీ, ఇప్పుడు ఎంతో తృప్తిగా అనిపిస్తున్నది. ఆత్మవిశ్వాసంతో పనిచేయగలుగుతున్నాం’ అన్నారు. ‘సుధ’ లాంటి ఉపాధ్యాయుల మనోభావాలు నేడు ఏ పాఠశాలకు వెళ్లినా కనిపిస్తున్నాయి.

దీనికి కారణం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత గత తొమ్మిదేండ్ల కాలంలో పాఠశాల విద్యాశాఖలో చోటుచేసుకున్న సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాల ప్రభావం అని చెప్పకతప్పదు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని కనిష్ఠ స్థాయికి పడిపోయిన విద్యా ప్రమాణాలను మూలాలతో ప్రారంభించి అభ్యసన ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు బోధిస్తుండటానికి మన రాష్ట్రంలో నిర్వహిస్తున్న గుణాత్మక కార్యక్రమాలే కారణం. ‘ఆంగ్ల మాధ్యమం, ద్విభాషా వాచకాలు, డిజిటల్ వనరులు, పరీక్షల సంస్కరణలు, ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతికత వినియోగం, ఆధునీకరించిన వాచకాలు ఇందుకు మూల స్తంభాలుగా నిలిచాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రైవేటీకరణ వేగంగా విస్తరిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వం పాఠశాలల ఉనికిని కాపాడటానికి, వాటికి పునరుజ్జీవనం కలిగించడానికి ఇవి తోడ్పతున్నాయి.

ఒకవైపు గుణాత్మక కార్యక్రమాలతో ముందంజలో వెళ్తుంటే, మరోవైపు ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రధానంగా పాఠశాల విద్యావ్యవస్థను పటిష్ఠపరచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి అమలుపరుస్తున్న ‘మన ఊరు – మన బడి/ మన బస్తీ–మన బడి’ కార్యక్రమం ఉమ్మడి పాలనలో చితికిపోయి వెలవెలబోయిన ప్రభుత్వ బడిని సమూలంగా మార్చడానికి తోడ్పడుతున్నది. నేడు ఈ కార్యక్రమం వల్ల మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు, డిజిటల్ వనరులతో 21వ శతాబ్దపు నైపుణ్యాలను మన పిల్లలకు అందించేలా సర్కారు బడి సిద్ధమైంది. పేద బడుగు వర్గాల పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో సర్కారు బడుల్లో నేర్చుకోవడానికి ఆంగ్ల మాధ్యమం తోడ్పడుతున్నది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ తెలంగాణలోని పిల్లలందరు తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా పిలుపునిచ్చి చట్టాన్ని రూపొందింపజేయడం అభినందనీయం.

విద్యాశాఖలోని అన్ని వివరాలను సాంకేతికత ద్వారా సేకరించి సుపరిపాలనకు బాటలు వేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ కవులు, కళాకారులు, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం గురించి విద్యార్థులందరు తెలుసుకొని స్ఫూర్తి పొందేలా వాచకాలను ఆధునీకరించారు. వీటి రూపకల్పనా సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం వారికి విద్య పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. బాలికల సాధికారత కోసం నిర్వహిస్తున్న కేజీబీవీ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలిచి ఆదర్శవంతంగా ముందుకువెళ్తున్నాయి. మిగతా రాష్ట్రాల్లో 10వ తరగతి వరకు విద్యనందిస్తుంటే మన రాష్ట్రంలో ఇంటర్ వరకు విస్తరించి వారి భవితకు బాటలు వేశారు. మన గురుకులాలు నాణ్యతకు మారుపేరుగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

> ఇలా రాష్ట్ర ఆవిర్భావం నాటి పరిస్థితితో పోలిస్తే పిల్లల నమోదు, పాఠశాలలు అందుబాటులోకి రావడం, వసతి సౌకర్యాలు మెరుగుపడటం, పాలనా సంస్కరణలు, నాణ్యమైన విద్యను అందించటం వంటి విషయాలలో ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకున్నది. నేడు విద్యాశాఖలో ఉన్న ప్రతి ఒక్కరు సగర్వంగా ఆనందించే స్థాయికి చేరుకున్నామని చెప్పకోవచ్చు.

ఈ విద్యాసంవత్సరం నుంచి బడి పిల్లలకు ఇచ్చే రాగిజావా, వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్‌లు, ఉపాధ్యాయులకు ఇచ్చే బోధనా ప్రణాళికలు, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు వంటివి మరిన్ని మెరుగైన ఫలితాలకు దోహదపడుతాయని చెప్పవచ్చు. గత సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయిలో నిర్వహిస్తున్న ‘తొలిమెట్టు’ కార్యక్రమంలాగానే ఈ విద్యా సంవత్సరం నుంచి 6 నుంచి 9వ తరగతి వరకు నిర్వహించనున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం, పదవ తరగతి పిల్లల కోసం అమలుచేస్తున్న సూక్ష్మస్థాయి కార్యాచరణ ప్రణాళిక ఉన్నత పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి తోడ్పడుతున్నాయి. పిల్లల్లో పఠణ సంస్కృతిని పెంపొందింపజేయడానికి బలోపేతమవుతున్న పాఠశాల గ్రంథాలయాలు, రీడింగ్ కార్నర్లు, పఠనోత్సవం కార్యక్రమం, సైన్స్ హ్యాకథాన్ వంటివి తెలంగాణలోని పాఠశాల విద్యాశాఖను అగ్రపథంలో నిలుపుతుందని ఆశించవచ్చు. బడి నుంచి భవితకు బాటలు పడటం ద్వారా బంగారు తెలంగాణ అతిత్వరలో సాకారమవుతుందని నమ్ముదాం.

(వ్యాసకర్త: విద్యావేత్త, ఎన్‌సీఈఆర్‌టీ జనరల్ బాడీ మాజీ సభ్యులు)

> పేద బడుగు వర్గాల పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో సర్కారు బడుల్లో నేర్చుకోవడానికి ఆంగ్ల మాధ్యమం తోడ్పడుతున్నది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ తెలంగాణలోని పిల్లలందరు తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా పిలుపునిచ్చి చట్టాన్ని రూపొందింపజేయడం అభినందనీయం.



# ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ



**ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి**
94402 36667

కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ దేశంలో 8వ పెద్ద రాష్ట్రం మన తెలంగాణ. ఉన్నత విద్యలో తెలంగాణ అత్యుత్తమ ప్రతిభను సాధిస్తున్నది. విద్యారంగంలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నది. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అనేక విద్యాసంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నిజానికి సాంకేతిక, సాంకేతికేతర విద్యనందించడంలో నేడు మన రాష్ట్రం దేశానికే ఆదర్శం.

ఉన్నత విద్యలో ‘జాతీయ విద్య’ నుంచి ‘గ్లోబల్ ఎడ్యుకేషన్’కు, ‘ఉపాధ్యాయ కేంద్రీకృత’ నుంచి ‘అభ్యాస-కేంద్రీకృత విద్య’కు మారింది. సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులను మన విద్యా వ్యవస్థ అందిస్తున్నది. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం తదేక దీక్షతో కృషిచేస్తున్నది. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, బోధనలో సాంకేతికతను పరిచయడం చేయడానికి ముఖ్యమైన ప్రణాళికలు రచిస్తూనే, వాటి అమలు కోసం విస్తృతంగా కృషి చేస్తున్నది.

రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎస్సీ: 30, ఎస్టీ: 22, బీసీ: 33 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేశారు. సంప్రదాయ కోర్సులతో పాటు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఫార్మా, న్యాయ, అగ్రికల్చరల్ కోర్సులను ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జేఎన్టీయూ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాఉటలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌ది.

వైద్య విద్యను అందరికీ అందుబాటులో తేవడం కోసం దేశంలో ఎక్కడాలేనివిధంగా ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటుచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కోఠిలోఉన్న ఉస్మానియా మహిళా కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశారు. అలాగే ములుగులోని ఎఫ్‌సీఆర్ఐ (ఫారెస్ట్ కాలేజీ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)ను అప్‌గ్రేడ్ చేస్తూ అటవీ విశ్వవిద్యాలయంగా ఏర్పాటుచేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, ఆలోచన, విధానాల వల్లనే రాష్ట్రం ఉన్నతమైన మైలురాళ్లను సాధించగలిగింది. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఎంతో అభివృద్ధిని సాధించగలిగాయి.

> దేశంలోని జీఈఆర్ 27.3 శాతం ఉంటే తెలంగాణలో జీఈఆర్ 39.1గా నమోదైంది. దేశంలోని మహిళల జీఈఆర్ 27.9 శాతంతో పోలిస్తే తెలంగాణ మహిళల జీఈఆర్ 40.3 శాతం, దేశంలోని ఎస్సీ మహిళల జీఈఆర్ 23.9 శాతంతో పోలిస్తే తెలంగాణలో ఎస్సీ మహిళల జీఈఆర్ 39.3 శాతంగా ఉన్నది. ఈ విధంగా అనేక అంశాల్లో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని నమోదు చేస్తున్నది.

రాష్ట్రంలోని ఉన్నతవిద్యలో మహిళల నమోదు కూడా వేగంగా పెరుగుతున్నది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు మహిళలు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి దోహదపడుతున్నాయి. దేశంలో పరిశోధన, ఉన్నతవిద్యకు కేంద్రంగా హైదరాబాద్ గుర్తింబచడింది. విద్యార్థులు తమ కెరీర్‌లో మరింత ప్రొఫెషనల్‌గా మారుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘దోస్త్’ దేశంలోనే ఒక రోల్‌మాడల్‌గా నిలిచింది. మన రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సేవల అడ్మిషన్ ప్రక్రియ 2016-17 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. ఇదెంతో పారదర్శకమైనది. ఇది మెరిట్, రోస్టర్ విధానాన్ని పాటిస్తూ, గ్రామీణ మెరిట్ విద్యార్థులు సైతం ప్రవేశం పొందడానికి దోహదపడుతుంది. అంతేకాకుండా అన్ని విశ్వవిద్యాలయాల అడ్మిషన్ల ప్రక్రియను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించేందుకు గాను తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసింది. డిమాండ్ ఉన్న అనేక కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు.

> అలాగే రాష్ట్రంలో, దేశంలో కూడా ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పాఠ్య ప్రణాళిక సవరణలు తెచ్చారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), బకెట్ సిస్టమ్ వంటి ఇతర సంస్కరణలు 2019-20 విద్యా సంవత్సరం నుంచి అన్ని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశపెట్టాయి. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు విజ్ఞానాన్ని, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ ప్రోగ్రామ్స్‌తో సమానమైన కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. తద్వారా విద్యార్థులు తమ ఇష్టమైన సబ్జెక్టులను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.

పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలతో టీఎస్‌సీహెచ్ఈ అవగాహన ఒప్పందాలు చేసుకున్నది. దీనికి సంబంధించి టీఎస్‌సీహెచ్ఈ, సీసీఈ, వివిధ విశ్వవిద్యాలయాలు బ్రిటిష్ కౌన్సిల్ టీసీఎస్, ఐఎస్‌బీ, క్రిస్ప్ లాంటి అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత ప్రకారం విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నాణ్యత, సమానత, సమ్మిళితత్వాన్ని సాధించడానికి అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు కృషిచేస్తున్నాయి.

(వ్యాసకర్త: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్)

తెలంగాణ రాష్ట్ర అవతరణ
దశాబ్ది ఉత్సవాలు
2014 - 2023

# విద్యాప్రగతిలో విజయ పరంపర

నేడు తెలంగాణ విద్యా దినోత్సవం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రం సాధించిన విజయాలను సంబురంగా జరుపుకొంటూనే భవిష్యత్తు లక్ష్యాలను స్థిరపరచుకుంటూ ముందుకువెళ్తున్న ఈ తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సాధించిన ఫలితాలను ప్రజల ముందుంచడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం.



**రావుల శ్రీధర్‌రెడ్డి**
9985575757

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఒక బృహత్ ప్రయత్నం ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయటం. ప్రత్యేకించి బడుగులకు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు, సురక్షితమైన వాతావరణంలో, అన్ని వసతులతో, సౌకర్యాలతో కూడిన విద్యనందించేందుకు చేపట్టిన గురుకుల విద్యావ్యవస్థ బలోపేతం అనేది భారత దేశంలోనే ప్రథమం అని చెప్పవచ్చు. ఒక రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్ల కాలంలో రమారమి 1000 నూతన గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు ఏర్పాటుచేయడం ప్రభుత్వాధినేత స్థిరచిత్తాన్ని ప్రత్యేకించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలలో విద్యాప్రగతి కోసం వారికున్న తపనను తెలియజేస్తుంది. ఆ వర్గాలలోని పిల్లల భవిష్యత్తు, వారి భావితరాల సమున్నత అభివృద్ధి, అదే సమయంలో ఆర్థిక సామాజిక వెనుకబాటుతనం వారి ఉన్నతికి ప్రతిబంధకం కాకూడదన్న ఒక దృఢ సంకల్పం గోచరిస్తున్నది. దాని ఫలితమే నేడు తెలంగాణలోని గురుకుల విద్యాకుసుమాలు. జాతీయస్థాయి పోటీ పరీక్షలలో సాధిస్తున్న విజయాలు. ఏదైనా ప్రయత్నానికి, గొప్ప ఆలోచనకు నిజమైన సార్థకత అనుకున్న లక్ష్యానికి చేరువ కావడమే. గురుకులాల విద్యార్థులు క్రీడలలో, సాంకేతిక విద్య లో, నీట్ లాంటి పరీక్షలలో పర్వతారోహణ వంటి క్లిష్టమైన అంశాలలో చూపిస్తున్న ఫలితాలు, ప్రతిభ ఎవరిసొత్తు కాదు, అవకాశాలు కల్పిస్తే అందరూ విజయానికి సోపానాలు వేసుకోగలుగుతారని రుజువు చేస్తున్నది.

నేడు గురుకులాల్లో ప్రవేశాల కోసం మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల రికమండేషన్లకు అవసరం వచ్చిందంటే, ప్రవేశాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పోటీ పడుతున్నారంటే, గురుకుల విద్యలో ప్రభుత్వం పెట్టిన



శ్రద్ధనే కారణం. ప్రధానంగా ఆర్థిక, సామాజిక వెనుకబాటు ఉన్న వర్గాలలో ఆడపిల్లలు ఎక్కువ కాలం చదువకపోవడం, ఉన్నత విద్యకు వెళ్లే సావాసం చేయకపోవడం, ఫలితంగా ఆర్థిక అనిశ్చితి మధ్యంతరంగా పెళ్లి చేసుకోవాల్సి రావడం వంటి పరిస్థితులు ఉండేవి. ఇలాంటి పరిస్థితులున్న పిల్లలకు ఇవాళ ప్రభుత్వ బడుల పటిష్ఠత, గురుకుల విద్య ఒక వరమైందని చెప్పవచ్చు. ప్రభుత్వం అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి ద్వారా దొరికిన ఒక భరోసా ఆడపిల్లల విద్య కొనసాగింపునకు ఒక మార్గమైందని చెప్పవచ్చు. తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో మార్పునకు కారణమైందని చెప్పవచ్చు. చదువు నుంచి పెళ్లి వరకు, బిడ్డకు తల్లయ్యేంతవరకు కూడా ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలు, కల్యాణలక్ష్మి, గర్భిణీ స్త్రీల సంరక్షణ, ప్రసూతి కేంద్రాలు, ప్రోత్సాహకాలు, ఆపై కేసీఆర్ కిట్ ఈ రకంగా స్త్రీ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషి వారిలో భద్రతాభావాన్ని పెంపొందించడమే కాదు, పూర్తిస్థాయిలో చదువును కొనసాగించి అనుకున్న మేరకు లక్ష్యాన్ని పూర్తిచేసుకోవడానికి ఒక భరోసానిచ్చిందనడంలో సందేహం లేదు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల కోసం ఏర్పాటుచేసిన స్టడీ సర్కిళ్లు ఆయా వర్గాలు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు తోడ్పడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన గ్రంథాలయాలు, పటిష్ఠం చేయబడినవి. నూతనంగా ఏర్పాటుచేసిన రీడింగ్ కార్నర్లు, పఠనా సామర్థ్యాన్ని పెంచుకునే కేంద్రాలవుతున్నాయి. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు సహాయపడుతున్నాయి. ‘మన ఊరు- మన బడి’ ద్వారా రాష్ట్రంలోని 26,065 పాఠశాలల్లో 12 అంశాలను చేపట్టి ఆధునీకరిస్తున్నది ప్రభుత్వం. కాంపౌండ్ వాల్స్, తాగునీరు, నూతన టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, పై కప్పుల పరిరక్షణకు రిపేర్లు, పాఠశాల ప్రాంగణంలో అవసరమైన రిపేర్లు, ఎలక్ట్రిక్ వ్యవస్థ ఆధునీకరణ, గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, డిజిటల్ విద్యకు ఐ.ఎఫ్.పీ తదితరాలు గ్రామీణ బస్తీ పాఠశాలలను పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన చేసేందుకు తీర్చిదిద్దుతున్నాయి. అల్పాహారం, ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితరాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సౌకర్యవంతమవుతున్నాయి. ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్ మాత్రమే కాకుండా విదేశీ విద్యకు కూడా ప్రభుత్వ సాయం అందుతున్నది. సాధారణ కుటుంబాల పిల్లలు బాగుండాలి, వారి చదువుల్లో వెలుగులు నిండాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం సాకారం అవుతున్నది.

> యూనివర్సిటీలలో ఆధునిక మౌలిక వసతుల ఏర్పాటుకు సంకల్పించిన ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో నూతన హాస్టళ్లు, పరిపాలన భవనాలు, ల్యాబ్‌లు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు, ఆధునీకరణకు, పెద్ద ఎత్తున నిధులు కేటాయించి కార్యాచరణకు పూనుకున్నది.

పై విధంగా రాష్ట్రంలో పాఠశాల విద్య మొదలుకొని ఉన్నత విద్య వరకు సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. దశాబ్ది ఉత్సవాల సాక్షిగా ఈ సంకల్పం మరింత దృఢతరమై రాబోయే రోజుల్లో, కేసీఆర్ నేతృత్వంలో, రాష్ట్రంలో విద్యావ్యవస్థ భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది.

(వ్యాసకర్త: టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్)